
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024

I



సోమశిలలో 18.399 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం సాయంత్రానికి 18.399 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,650 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,250
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,770
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,943
నవర (8 గ్రాములు)	రూ.47,544

గరిష్టం/కనిష్టం
33.0 /26.2

వాతావరణం

శనివారం గాలిలో తేమ 69 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు నిలకడగా ఉన్నాయి. ఆదివారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ఎన్నికలకు పటిష్ట చర్యలు

• ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్



నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సాంకేతికంగా పటిష్ట చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులైన కావలి ఆర్డీఓ శీనానాయక్, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ చిన ఓబులేసులతోపాటు ఎన్నికల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు.

వెబ్‌సైట్‌లో ఇన్‌స్పైర్ మనక్ సర్టిఫికెట్లు


నెల్లూరు(టౌన్): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైన విద్యార్థులకు ఇన్‌స్పైర్ మనక్ వెబ్‌సైట్‌లో సర్టిఫికెట్లు అందుబాటులో ఉన్నట్లు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ వెబ్‌సైట్ ద్వారా సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైన విద్యార్థుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలో రూ.10 వేల నగదు జమ చేయనున్నట్లు తెలిపారు.

నేడు జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

కోవూరు: మండలంలోని పడుగుపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మార్చి 8 నుంచి జరగనున్న అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ పోటీలకు ఆదివారం జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి విజయానందం, ఉపాధ్యక్షుడు డేవిడ్ జాన్సన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 85 కిలోల లోపు బరువు కలిగిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, ఆసక్తి కలిగిన వారు కోవూరులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సాయంత్రం 4 గంటలకు జరిగే ఎంపికలకు ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు.

బీసీలకు చోటేదీ!

'టీడీపీ అధిష్టానం బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తోంది. అటు పార్టీ పదవుల్లోనూ, ఇటు ఎన్నికల్లో అభ్యర్థులకు టికెట్ల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం కల్పించడం లేదు. సామాజిక న్యాయం పాటించకుండా వివక్ష చూపుతోంది.' అంటూ జిల్లాలోని బీసీలు ఆ పార్టీపై మండిపడుతున్నారు. తాజాగా టీడీపీ అధిష్టానం ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితాలో జిల్లాలో బీసీల ఊసే లేకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



- ఉమ్మడి జిల్లాలో బీసీలకు సీట్లివ్వని టీడీపీ
- నమ్మించి మోసం చేస్తున్నారని ఆ వర్గీయుల మండిపాటు
- సామాజిక సమతుల్యం పాటిస్తూ సీట్లిస్తున్న వైఎస్సార్‌సీపీ
- టీడీపీలో అగ్రకులాలకే సీట్లు కేటాయిస్తున్నారంటూ ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి టీడీపీ తన అభ్యర్థుల జాబితాను ప్రకటించిన నేపథ్యంలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై ఆ వర్గీయులు మండిపడుతున్నారు. తొలి జాబితాలో ఆరుగురు అభ్యర్థులను ప్రకటించినా ఎక్కడా బీసీల ఊసే కన్పించలేదు. ఓ వైపు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల ఖరారులో బీసీలకు సముచితస్థానం ఇస్తూ కేటాయింపులు చేస్తున్నారు. కానీ టీడీపీలో ఆ ఊసే కన్పించకపోవడంతో బీసీ కులాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు జయహో బీసీ అంటూ సభలు పెట్టి ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన టీడీపీ అధిష్టానం తమను మోసం చేసిందంటూ ఆ వర్గం నేతలు రగిలిపోతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 10 నియోజకవర్గాల్లో గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడు. మిగిలిన 8 నియోజకవర్గాల్లో ఉదయగిరి (కాకర్ల సురేష్), కావలి (కావ్య కృష్ణారెడ్డి), నెల్లూరు సిటీ (పొంగూరు నారాయణ), నెల్లూరు రూరల్ (కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి) నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేసినట్లు టీడీపీ అధిష్టానం ప్రకటించింది. ఆ నాలుగు సీట్లలో రెండు రెడ్డి సామాజిక వర్గానికి, కమ్మ, కాపులకు చెరొకటి ఇచ్చింది. కాగా మిగిలిన సర్వేపల్లి, ఆత్మకూరు, వెంకటగిరి, కోవూరు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించకపోయినా ఆయా నియోజకవర్గాల్లో ఓసీలే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో బీసీలకు సీటు లేనట్లేనని ఆ వర్గీయులు మండిపడుతున్నారు.

పార్టీ పదవులతోనే సరి !

టీడీపీలో బీసీ నేతగా ఉన్న మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు కేవలం పార్టీ పదవులిచ్చి సరిపెట్టింది. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కలేదు. అలాగే జెడ్పీ మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ ఉదయగిరిలో పార్టీని నమ్ముకుని కష్టపడుతున్నా ఆయన పేరు పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం. గత ఎన్నికల్లో టీడీపీకి నెల్లూరు రూరల్‌లో అభ్యర్థి దొరక్క గత్యంతరం లేని పరిస్థితుల్లో మైనార్టీ నేత అబ్దుల్‌అజీజ్‌కు అవకాశం కల్పించింది. కానీ ఆ సీటు పోతుందని తెలిసి కూడా అప్పట్లో అబ్దుల్‌అజీజ్ బరిలో నిలిచారు. నాలుగేళ్లు పార్టీని నమ్ముకుని, ఎన్నో అవమానాలు, ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలిచినప్పటికీ చివరకు టీడీపీ అధిష్టానం ఆయనకు మొండిచేయి చూపింది. వెంకటగిరిలో మస్తాన్‌యాదవ్‌కు పార్టీ టికెట్ కేటాయించలేదు. కావలిలో పసుపులేటి సుధాకర్‌ను నమ్మించి పార్టీ ఫండ్ తీసుకుని హ్యాండిచ్చింది.

మీడియా ముందుకు బీసీ నేతలు

జిల్లాలో టీడీపీకి చెందిన కొందరు బీసీ నేతలు ఇటీవల ఆ పార్టీ జిల్లా పెద్దల ఇళ్లకు వెళ్లి తమ వర్గీయులకు సీటివ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ, బీసీలను జిల్లాలో చెరొక చోట ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలుగా నియమించిందని, మరి టీడీపీలో బీసీల ఊసే లేదని నిలదీశారు. టీడీపీలో మమ్మల్ని పావులుగా వాడుకుంటున్నారే తప్ప ఏనాడూ తమకు ప్రాధాన్యం ఇవ్వలేదని వారు మండిపడ్డారు. టీడీపీలో బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు పార్లమెంట్ సీటు విషయంలో కూడా చెంచలబాబుయాదవ్‌కు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో సమన్యాయం

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు పెద్దపీట వేసింది. జిల్లాలో 2014 ఎన్నికల సమయంలో నెల్లూరు సిటీ సీటు బీసీ వర్గానికి చెందిన పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఇచ్చి సామాజిక న్యాయానికి శ్రీకారం చుట్టింది. అలాగే 2019 ఎన్నికల్లో కూడా ఆయనకే రెండోసారి సీటివ్వడంతోపాటు ఏకంగా మంత్రిని పదవి ఇచ్చి సముచిత గౌరవాన్ని చాటింది. అలాగే బీద మస్తాన్‌రావుకు రాజ్యసభ సీటిచ్చి పెద్దల సభలోనూ బీసీలకు సముచిత స్థానం కల్పించింది. అంతేకాక పార్టీ పదవుల్లో, కార్పొరేషన్ చైర్మన్ల కేటాయింపుల్లో, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీ వైస్ చైర్మన్ల ఎంపికల్లోనూ సామాజిక సమతుల్యం పాటించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను గౌరవించింది. దీంతో బీసీలు వైఎస్సార్‌సీపీపై ఎనలేని అభిమానం చాటుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో బీసీలు టీడీపీ అధిష్టానం తీరుపై మండిపడుతున్నారు.

కాకర్ల సురేష్‌ను ఓడిస్తా

- స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటా
- పన్నెండేళ్లుగా టీడీపీ కోసం సర్వం అర్పించా
- డబ్బు సంచులకు టికెట్లు అమ్ముకున్నారు
- ఆంతరంగికుల వద్ద బొల్లినేని ఆవేదన
- ఫోన్ చేసిన చంద్రబాబుపై ఫైర్
- వైఎస్సార్‌సీపీ పెద్దలతో టచ్‌లోకి..



ఉదయగిరి: టీడీపీ ఉదయగిరి టికెట్ కాకర్ల సురేష్‌కు ఇవ్వడంతో మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లినేని రామారావు అధిష్టానంపై ఫైర్ అయ్యారు. 'కాకర్ల ఎలా గెలుస్తారో నేను చూస్తా.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి నా సత్తా ఏంటో చూపిస్తా.. పన్నెండేళ్లుగా పార్టీ కోసం సర్వం అర్పించా.. ఉదయగిరిలో పార్టీకి దిక్కు లేని సమయంలో పార్టీని, క్యాడర్‌ను కాపాడుకున్నా.. ఆర్థికంగా ఎంతో నష్టపోయా.. ఇప్పుడు డబ్బు సంచులకు అమ్ముడుపోయి, కనీసం రాజకీయ అనుభవం లేని వ్యక్తికి ఉదయగిరి టికెట్ ఇచ్చి నా గొంతు కోశారు..' అంటూ తన ఆంతరంగికుల వద్ద బొల్లినేని రామారావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయగిరిలో బొల్లినేని శుక్రవారం టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు తనను మోసం చేయరు అని చెప్పి 12 గంటలు గడవక ముందే నియోజకవర్గ అభ్యర్థిగా కాకర్ల సురేష్ పేరు ప్రకటించడంతో బొల్లినేని షాక్‌కు గురయ్యారు. నమ్మిన వారిని నట్టేట ముంచే గుణం ఉన్న చంద్రబాబు బొల్లినేని విషయంలో అలాగే చేశారని ఆయన అనుచరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఉదయగిరి నుంచి మా నాయకుడు బొల్లినేని బరిలో ఉంటారు.. ఇక్కడ చంద్రబాబు ఆటలు సాగవు.. కాకర్ల సురేష్ పేరును వెంటనే విత్‌డ్రా చేసుకుని బొల్లినేనిని అభ్యర్థిగా ప్రకటించాలి.. లేకపోతే మా సత్తా ఏంటో ఎన్నికల్లో చూపిస్తాం..' అంటూ బొల్లినేని అనుచర వర్గం తీవ్ర ఆగ్రవేశాలతో రగిలిపోతున్నారు. ఉదయగిరిలో ఎన్ని ఊర్లు ఉన్నాయో, ఏ పంచాయతీలో టీడీపీ నాయకుడు ఎవరో కూడా తెలియని వ్యక్తికి టికెట్ ఎలా ప్రకటిస్తారంటూ టీడీపీ అధిష్టానంపై విరుచుకుపడుతున్నారు. 'లోకేశ్ డబ్బులు తీసుకొని టికెట్ అమ్ముకున్నారు.. కాకర్లను ఎలా గెలిపిస్తారో చూస్తాం.. మీరేమీ అధైర్యపడొద్దు' అంటూ బొల్లినేనికి ఆయన అనుచరులు ధైర్యం చెప్పినట్లు తెలుస్తోంది.

చంద్రబాబుపై ఫైర్

టీడీపీ జాబితా మరో గంటలో ప్రకటించే ముందు చంద్రబాబు బొల్లినేనికి ఫోన్ చేసి.. 'కాకర్ల సురేష్‌కు ఉదయగిరి టికెట్ ఇస్తున్నాం.. మీకు రాజ్యసభ సీటు ఇస్తాం' అని చెప్పబోతుండగా బొల్లినేని తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. ఇన్నేళ్లుగా తనను వాడుకొని, ఇప్పుడు కరివేపాకులా తీసిపడేయడం ఏంటని గట్టిగా అధినేతపై ఫైర్ అయినట్లు తెలిసింది. అయితే చంద్రబాబు వారించేందుకు ప్రయత్నించగా.. ఉదయగిరిలో టీడీపీ ఎలా గెలుస్తుందో చూస్తానంటూ బొల్లినేని ఫోన్ కట్ చేసినట్లు సమాచారం. వెంటనే తన అనుచరులతో మాట్లాడుతూ 'కాకర్లను ఓడించి తీరాలి.. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలబడి మన సత్తా చూపిద్దాం..' అని బొల్లినేని అన్నట్లు తెలిసింది. త్వరలో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని అనుచరులతో అన్నట్లు సమాచారం. చంద్రబాబు తనకు చేసిన అన్యాయాన్ని జీర్ణించుకోలేని బొల్లినేని వైఎస్సార్‌సీపీ పెద్దలతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది.

రాజీనామా బాటలో బొల్లినేని అనుచరులు

టీడీపీ ఉదయగిరి టికెట్ కాకర్ల సురేష్‌కు ప్రకటించడంతో తీవ్రంగా రగిలిపోతున్న బొల్లినేని అనుచరుల్లో కొంతమంది ఆ పార్టీకి, పార్టీ పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. టీడీపీ దుత్తలూరు మండల కేంద్రం ఇన్‌చార్జి కండగుంట్ల వెంకటరెడ్డి పదవికి రాజీనామా చేశారు. ఇదే బాటలో మరి కొంతమంది ఉన్నట్లు తెలుస్తోంది. పలు మండలాల్లో ఆదివారం సమావేశాలు నిర్వహించి పార్టీకి, పదవులకు రాజీనామాలు చేసే యోచనలో ఉన్నట్లు అసమ్మతి నేతలు చెబుతున్నారు. మొత్తమ్మీద ఉదయగిరి టీడీపీ టికెట్ ప్రకటన కాకర్ల వర్గీయుల్లో ఆనందాన్ని నింపితే.. బొల్లినేని వర్గీయులను నిరుత్సాహానికి గురిచేసింది. ఈ పరిణామం పార్టీకి తీవ్ర నష్టం చేకూరుస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

గ్రూప్–2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): జిల్లావ్యాప్తంగా ఆదివారం జరగనున్న గ్రూప్–2 పరీక్షలకు పకడ్బందీగా భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జిల్లాలోని 80 కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 9.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, 10.15 గంటలు దాటిన తర్వాత ఎవరినీ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నిర్ణీత సమయానికి అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఇప్పటికే వాటి నిర్వాహకులకు సూచించామన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్స్, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్, స్మార్ట్‌వాచ్ తదితరాలను అనుమతించేది లేదన్నారు. పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించబోమని తెలిపారు.

పైసలిచ్చిన వారికే టీడీపీ సీట్లు

- టికెట్ల కేటాయింపులో డబ్బుకే ప్రాధాన్యం
- సీనియర్లకు రిక్తహస్తం
- జనసేన ఆశలు గల్లంతు
- వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేకు మొండిచేయి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ టికెట్ల వ్యాపారానికి తెరతీసిందని జరుగుతున్న ప్రచారం నిజమైంది. ఆ పార్టీ అధిష్టానం తాజాగా ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా.. టీడీపీ టికెట్ల జాబితాలో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ఉదయగిరిలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావును కాదని, ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కు టికెట్ ఖరారు చేసింది. ఉదయగిరి సీటు ఆశించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా ఓటు వేసిన వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి మొండిచేయి చూపింది. ఆయనకు టికెట్ ఇస్తామని చెప్పి చివరకు ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కు సీటు ఖరారు చేయడం వెనుక పార్టీ అధిష్టానానికి భారీగానే ముడుపులు ముట్టినట్లు సమాచారం. నిన్నటి వరకు ఉదయగిరి టికెట్ తనదేనని.. తనను కాదని వేరెవరికీ టికెట్ కేటాయించే అవకాశం లేదని బీరాలు పలికిన బొల్లినేనికి చుక్కెదురైంది. తన సీటుకే ఎసరు పెట్టిన కాకర్లకు రానున్న ఎన్నికల్లో ఎంత మాత్రం సహకరించే అవకాశం లేదని బొల్లినేని స్పష్టం చేసినట్లు తెలిసింది.

ధనవంతులకు జై కొట్టిన టీడీపీ

టీడీపీ కావలి టికెట్ దగుమాటి కృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి)కి ఇస్తున్నట్లు ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. గత ఐదేళ్లుగా పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న మాలేపాటి సుబ్బానాయుడును పక్కన పెట్టి ధనవంతుడైన కావ్య కృష్ణారెడ్డికి టికెట్ కేటాయించడం వెనుక పార్టీకి భారీగా డబ్బు సంచులు అందినట్లు సమాచారం. ఇదేవిధంగా నెల్లూరు సిటీ టికెట్ మాజీ మంత్రి పొంగూరు నారాయణకు, నెల్లూరు రూరల్ టికెట్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి చంద్రబాబు కేటాయించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం నెల్లూరు రూరల్‌తో ముడిపడి ఉండడంతో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి టికెట్ ఇవ్వకపోతే నారాయణకు నష్టం చేకూరే అవకాశం ఉందని భావించి ఆ సీటుకు కూడా నారాయణే డబ్బు సంచులు అందజేసినట్లు ప్రచారం జరుగుతోంది. తొలి జాబితాలో కోవూరులో దినేష్‌కు సీటు ఖరారు చేయకపోవడం వెనుక అతనిని మార్చే ఉద్దేశం ఉందేమోనని ఆపార్టీ నేతలే చెబుతున్నారు.

'జనసేన' ఆశలపై నీళ్లు

జనసేన పార్టీ ఆది నుంచి నెల్లూరు సిటీ కానీ.. నెల్లూరు రూరల్ సీటు కానీ ఆశిస్తోంది. తాజాగా ఈ రెండు నియోజకవర్గాలను టీడీపీ అభ్యర్థులకే కేటాయించడంతో జనసేన టికెట్ ఆశిస్తున్న మనుక్రాంత్‌రెడ్డి ఆశలు గల్లంతయ్యాయి. ఇప్పటికే మనుక్రాంత్‌రెడ్డి నెల్లూరు సిటీతోపాటు రూరల్ నియోజకవర్గాల్లో తన క్యాడర్‌తో కలిసి హడావుడి చేశారు. జనసేన పార్టీ కార్యాలయాలను కూడా ప్రారంభించారు. పార్టీ కోసం చేతిచమురు వదిలించుకున్నా ఫలితం దక్కలేదు.

బహిష్కృత ఎమ్మెల్యేల దుస్థితి

వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి జంప్ చేసిన ముగ్గురు ఎమ్మెల్యేల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి మాత్రమే టీడీపీ అధిష్టానం సీటిచ్చింది. ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డిలకు సీట్లు ఖరారు చేయలేదు. ఎమ్మెల్యే ఆనం పేరు తొలి జాబితాలో లేకపోవడంపై ఆయన అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఉదయగిరి ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డికి సీటు ఇస్తామని ఆశ చూపిన టీడీపీ అధిష్టానం మోసం చేసింది. అలాగే టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరు తొలి జాబితాలో లేకపోవడం గమనార్హం. జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల సీట్లిప్పించే స్థాయి నుంచి సోమిరెడ్డి తన సీటు కోసం ఎదురుచూడాల్సిన దీనస్థితికి రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురి డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని ఆ విశ్వవిద్యాలయం పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 4,344 మంది విద్యార్థులకు గాను, 4,021 మంది హాజరై, 323 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పొదుపు మహిళలను ముంచిన చంద్రబాబు

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి


రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : రాష్ట్రంలో పొదుపు మహిళలను నిలువునా ముంచిన చరిత్ర చంద్రబాబుదని, పొదుపు రుణాలను మాఫీ చేస్తానని నమ్మబలికి పసుపు-కుంకుమతో సరిపెట్టాడని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లపాళెంలో రూ.24 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో రుణమాఫీ పేరుతో రైతులు, పొదుపు మహిళలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబునాయుడు అని అన్నారు. తిరిగి అధికారంలోకి రావాలని తన ఇష్టానుసారం వాగ్దానాలు చేస్తున్నారని తెలిపారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చుతున్నట్టు విమర్శించిన బాబు అవే పథకాలను రెట్టించి అందజేస్తానని నాలుక మడతేసి చెప్పడాన్ని ప్రజలు నమ్మడం లేదన్నారు. గత ప్రభుత్వంలో నల్లపాళెనికి రోడ్డు నిర్మిస్తానని శంకుస్థాపన చేసిన సోమిరెడ్డి ఒక్కరూపాయి నిధులు ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2.30 కోట్లతో సిమెంట్‌రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. నల్లపాళెం సచివాలయ పరిధిలో సంక్షేమం, అభివృద్ధికి రూ.24.94 కోట్లు కేటాయించామని చెప్పారు. 112 మందికి 178 ఎకరాల అసైన్మెంట్‌ భూములను అందజేశామని, 148 ఎకరాలకు పూర్తి యాజమాన్య హక్కులను కల్పించామని వివరించారు.

సోమిరెడ్డికి ధనంపై మోజు

టీడీపీ నాయకుడు సోమిరెడ్డికి ధనంపై ఉన్న మోజు జనంపై లేదని, తనకు మాత్రం జనంపై అభిమానం ఉందని మంత్రి కాకాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వనరులకు కొరత లేదని కనుకనే సోమిరెడ్డి ఇక్కడే టికెట్‌ సంపాదించి నిధులు వసూలు చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఐదేళ్లు ఏసీల్లో గడిపి ఇప్పుడొచ్చి జనం కోసమే బతుకుతున్నానని సోమిరెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలను పట్టించుకోని ఆయన ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుక్కుంటాడని విమర్శించారు. తనకంటే ఎక్కువగా సోమిరెడ్డి గ్రామాల్లో అభివృద్ధి చేసినట్లుగా నిరూపిస్తే ఎన్నికల నుంచే తప్పుకుంటానని మంత్రి కాకాణి సవాల్‌ విసిరారు. టీడీపీ టికెట్‌ వస్తుందో లేదో తెలియక సోమిరెడ్డి ఊగిసలాడుతున్నాడని, అధిష్ఠానం మెప్పుకోసం సర్వేపల్లిలో పార్టీని బలోపేతం చేస్తున్నట్టు బిల్డప్‌ ఇస్తున్నారన్నారు. జిల్లా వ్యవసాయాధికారిణి సత్య వాణి, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్‌ వీరవసంతరావు, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ, జెడ్పీటీసీ నిర్మలమ్మ, నాయకులు కోనం చినబ్రహ్మయ్య, పామూరు లచ్చారెడ్డి, పలుకూరు పోలిరెడ్డి, జేసీఎస్‌ కన్వీనర్‌ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పీ శ్రీనివాసులురెడ్డి, ఎన్‌ శ్రీనివాసులురెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్‌

చేజర్ల/సోమశిల: చేజర్ల, అనంతసాగరం మండలాల్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్‌ చేశారు. చేజర్ల మండలం నూతక్కివారికండ్రిగలో దుకాణాల్లో, అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలోని ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు..నూతక్కివారికండ్రిగలోని శ్రీసాయి ట్రేడర్స్‌ షాపు కిటికీ అద్దాలు పగులగొట్టిన దొంగలు కత్రసాయంతో డెస్క్‌లోని రూ.10 వేలకుపైగా నగదు అపహరించారు. శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ కూల్‌డ్రింక్‌ షాపు పైకప్పు తెరిచి లోనికి ప్రవేశించిన దొంగలు కొంత నగదు అపహరించారు. శనివారం ఉదయం షాపుల యజమానులు చోరీని గమనించి చేజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రభాకర్‌ క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పాతదేవరాయపల్లికి చెందిన నరసింహులు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సాయంత్రం ఏఎస్‌పేట దర్గాకు వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని రెండు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.12వేల నగదు, మరికొన్ని వస్తువులు కనిపించలేదు. దీంతో అనంతసాగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సూర్యప్రకాష్‌ రెడ్డి క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన వెంట ఏఎస్సై మస్తాన్‌బాషా, కానిస్టేబుల్‌ శ్రీను ఉన్నారు.

క్లుప్తంగా

బైక్‌ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై విశ్వనాథరెడ్డి

మర్రిపాడు: బైక్‌ అదుపు తప్పడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని నందవరం సమీపంలో నల్లగొండ్ల రహదారిపై శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బైక్‌ అదుపు తప్పి పల్లంగా ఉన్న రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోవడంతో ద్విచక్ర వాహనచోదకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై విశ్వనాథరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ఆధారంగా వింజమూరు మండలం గుండెమడగలకు చెందిన మాల్యాద్రి (40)గా గుర్తించి అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

29లోగా రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలి

నెల్లూరు(సెంట్రల్‌): జిల్లాలోని దుకాణాలు, వ్యాపార సంస్థల నిర్వాహకులు ఈ నెల 29లోగా రిజిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌ను పొందాలని సహాయ కార్మిక కమిషనర్‌ ఎస్కే గౌస్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్‌ పొందిన వారు రెన్యువల్‌ చేసుకోవాలని సూచించారు. కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌ను సింగిల్‌ విండో విధానంలో సచివాలయాలు లేదా ఆన్‌లైన్‌ ద్వారా చేసుకోవచ్చని తెలిపారు. గడువులోగా రిజిస్ట్రేషన్‌ చేసుకోని వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

మాలకొండస్వామి సేవలో హైకోర్టు జడ్జి


గోపూజ చేస్తున్న జడ్జి రాజశేఖర్‌ దంపతులు

వలేటివారిపాళెం: మాలకొండలో కొలువైన శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి తర్లాడ రాజశేఖర్‌ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ డిప్యూటీ కమిషనర్‌ కేబీ శ్రీనివాసరావు స్వాగతం పలకగా, ఆలయ ప్రధానార్చకుడు గౌరీశంకర్‌ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జడ్జి దంపతులు గోశాలను సందర్శించి గోపూజ చేశారు.

త్వరలో డీసీఎమ్మెస్‌ ద్వారా భారత్‌ రైస్‌ విక్రయాలు


పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎమ్మెస్‌ చైర్మన్‌ వీరి చలపతిరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): కేంద్ర ప్రభుత్వం భారత్‌ రైస్‌ బ్రాండ్‌తో తీసుకొచ్చిన రూ.29కే కిలో బియ్యాన్ని త్వరలో డీసీఎమ్మెస్‌ ద్వారా విక్రయించనున్నట్లు డీసీఎమ్మెస్‌ చైర్మన్‌ వీరి చలపతిరావు తెలిపారు. నగరంలోని నవాబుపేటలోని డీసీఎమ్మెస్‌కు చెందిన పాత రైస్‌మిల్లు స్థలంలో శనివారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నష్టాల్లో ఉన్న డీసీఎమ్మెస్‌ను రూ.8 కోట్ల లాభాల్లోకి తీసుకొచ్చామని తెలిపారు. గతంలో ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా వచ్చే కమీషన్, పాత రైస్‌మిల్లు అద్దె ద్వారా డీసీఎమ్మెస్‌కు ఆదాయం సమకూరేదన్నారు. ప్రస్తుతం అవి రెండూ లేని కారణంగా ఆదాయం రావడం లేదన్నారు. ఆత్మకూరులోని షాపింగ్‌ కాంప్లెక్స్‌ ద్వారానే కొద్దిపాటి ఆదాయం వస్తోందన్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా డీసీఎమ్మెస్‌ ద్వారా ఎరువులు, జనరిక్‌ మందులు, నాణ్యమైన పప్పు దినుసులు విక్రయించాలని పాలకవర్గం నిర్ణయం తీసుకుందన్నారు. గత పాలకుల తప్పిదాలతో ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో తమ హయాంలో రూ.12 లక్షలు చెల్లించాల్సి వచ్చిందన్నారు. పాత రైసుమిల్లు స్థలంలో కల్యాణ మండపం, షాపింగ్‌ కాంప్లెక్స్‌ నిర్మాణ పనులకు అనుమతుల కోసం సహకార మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సహకార కమిషనర్, రాష్ట్ర ప్రిన్సిపల్‌ సెక్రటరీను కోరామన్నారు. ఈ సమావేశంలో డీసీఎమ్మెస్‌ పాలకవర్గసభ్యులు గురునాథం, ఖిల్జీసలీం, సురేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, బిజినెస్‌ మేనేజర్‌ వెంకటస్వామి పాల్గొన్నారు.

కావలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తాం


మీడియాతో మాట్లాడుతున్న మన్నెమాల

కావలి: ఎవరెన్ని కుట్రలు పన్నినా రానున్న ఎన్నికల్లో కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి ప్రతిజ్ఞ చేశారు. శనివారం ఆయన బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయం బయట ఆయన మీడియాతో మాట్లాడారు.

నీతిమాలిన రాజకీయాలు చేయను

రాజకీయంగా తాను ఈ స్థాయికి చేరుకోవడానికి కారకులు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అని, అలాంటి వారికి ద్రోహం చేసే నీతిమాలిన రాజకీయాలు చేయాల్సిన అవసరం తనకు లేదని మన్నెమాల అన్నారు. పార్టీ కుటుంబం వంటిదని, అందులో చిన్న సమస్యలు వచ్చాయని, అవి ఇప్పుడు సమసిపోయాయన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో తనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సమష్టిగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. వ్యక్తిగతంగా తనకు ఎవరితో వైరం లేదని, పార్టీలోని అందరితో కలిసి పని చేస్తానన్నారు. పార్టీకి దూరంగా ఉన్నా వేలాది మంది అభిమానులు తనకు తోడుగా ఉన్నారని, వారందరి పాదాలకు వందనాలు చేస్తున్నాన్నారు. కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

• ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి


ఏరియావైద్యశాలలో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏరియా వైద్యశాలలో రూ.7.78 కోట్ల ఖర్చుతో నిర్మించిన నూతన భవనాన్ని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా కందుకూరు ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్యకు అనుగుణంగా రూ.7.78 కోట్లతో అదనపు భవనాన్ని నిర్మించారని తెలిపారు. ల్యాబ్‌కు సంబంధించి అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. వలేటివారిపాళెం, గుడ్లూరు మండలాల్లోని పోకూరు, చేవూరు గ్రామాల్లో నూతన పీహెచ్‌సీలు మంజూరు చేసినట్లు తెలిపారు. వాటికి సంబంధించి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో పేదలు అధికంగా నివసించే కోటారెడ్డినగర్, జనార్దనకాలనీ ప్రాంతాల్లో అర్బన్‌ హెల్త్‌సెంటర్లను నిర్మించినట్లు తెలిపారు. మాచవరం పీహెచ్‌సీకి అదనపు భవనాలు మంజూరయ్యాయని, త్వరలో పనులను ప్రారంభిస్తామని వివరించారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొని వైద్యులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధి, మందులు, ఇతర సౌకర్యాలకు సంబంధించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌ శకుంతల, ఏపీఎంఎస్‌ ఐడీసీ అధికారులు చిట్టిబాబు, విజయభాస్కర్, వైద్యులు ఇంద్రాణి, రమేష్‌నాథ్‌ పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ సౌజన్య, సీఐ హైమారావు

బుచ్చిరెడ్డిపాళెంరూరల్‌: మండలంలోని రెడ్డిపాళెంలో దారుణం చోటు చేసుకుంది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిని గుర్తుతెలియని దుండగులు హత్య చేసి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. రెడ్డిపాళెంలో జీ ఈశ్వరమ్మ (74) ఒంటరిగా నివాసం ఉంటోంది. ఆమె రెండ్రోజులుగా ఇంట్లో నుంచి బయటకు రావడం లేదు. శనివారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు అనుమానంతో వెళ్లి చూడగా రాజేశ్వరమ్మ మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి చుట్టుపక్కల వారి నుంచి వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రెండ్రోజుల క్రితం వృద్ధురాలు హత్యకు గురై ఉంటుందని నెల్లూరు రూరల్‌ డీఎస్పీ వీరాంజనేయులురెడ్డి తెలిపారు. తలపై తీవ్రగాయం ఉందని, నగలు, నగదు కోసమే వృద్ధురాలిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లుగా ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఘటనా స్థలాన్ని ఏఎస్పీ సౌజన్య పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హైమారావు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు



బ్రాయిలర్‌ (లైవ్‌)	: 156
లేయర్‌ (లైవ్‌)	: 80
బ్రాయిలర్‌ చికెన్‌	: 270
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	: 300
లేయర్‌ చికెన్‌	: 136

నిమ్మధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ. 75
సన్నవి	: రూ. 60
పండ్లు	: రూ. 22





వైరల్

సన్నాఫ్ విరాట్ కోహ్లీ

అనుష్క శర్మ ఈ నెల 15న పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అబ్బాయికి 'అకాయ్' అని పేరు పెట్టినట్లు తెలియజేశాడు విరాట్ కోహ్లీ. అయితే 'అకాయ్' ఫొటోను ఎక్కడా షేర్ చేయలేదు. దీంతో 'అకాయ్' రూపాన్ని రకరకాలుగా ఊహించుకుంటూ అభిమానులు ఏఐ జెనరేటెడ్ ఫొటోలను క్రియేట్ చేశారు. అకాయ్‌ను విరాట్ ఎత్తుకున్నట్లు, విరాట్–అనుష్కలు అకాయ్‌తో ఆడుకుంటున్నట్లు... ఇలా రకరకాలుగా క్రియేట్ చేశారు.

'అకాయ్ ఫొటో షేర్ చేయకుండా విరాట్ కోహ్లీ మంచి పని చేశాడు. చేసి ఉంటే ఇంత అద్భుతమైన చిత్రాలను చూసి ఉండేవాళ్లం కాదు' అంటూ నెటిజనులు ప్రశంసల జల్లు కురిపించారు.

ప్రశంసల వర్షం ఒక కోణం అయితే... సాంకేతిక ఆసక్తి మరో కోణం. 'మీరు ఉపయోగించిన ఏఐ టూల్స్ గురించి వివరంగా తెలుసుకోవాలని ఉంది' అంటూ చాలామంది కామెంట్స్ పెడుతున్నారు.

శాస్త్రీయ నృత్య వేషధారణ అనగానే శాస్త్రీయ నృత్యమే కళ్ల ముందు కదలాడుతుంది. అలా కాకుండా ర్యాప్ వినిపిస్తే ఎలా ఉంటుంది అని చెప్పడానికి ఈ వీడియో ఉదాహరణ. నటి అదా శర్మ క్లాసికల్ డ్యాన్సర్ వేషంలో అమెరికన్ ర్యాపర్ ఎమినెమ్ ఐకానిక్ ర్యాప్ 'ర్యాప్ గాడ్' ట్రాక్‌తో 'వావ్' అనిపించింది.

కరచరణో రసి మణిగణ భూషణ... లుక్... ఐ వాజ్ గోనా గో



ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ రీల్ వైరల్‌గా మారింది. శర్మను ప్రశంసలతో ముంచెత్తిన వారిలో హీరో అయుష్మాన్ ఖురాన, నటి ఊర్వశీ రౌటేల, ఇండియన్ ర్యాపర్ రఫ్తార్‌లాంటి సెలబ్రిటీ కూడా ఉన్నారు.

యూట్యూట్ ద్వారా 2013లో విడుదలైన 'ర్యాప్ గాడ్' సాంగ్ సూపర్ హిట్ కావడమే కాదు 'మోస్ట్ వర్డ్స్' విశేషంతో 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్'లోకి ఎంటర్ అయింది. ఎన్నో అవార్డ్‌లు గెలుచుకుంది.

'లుక్, ఐ వాజ్ గోనా గో ఈజీ ఆన్ యూ నాట్ టు హర్ట్ యువర్ ఫీలింగ్స్
బట్ ఐయామ్ వోన్లీ గోయింగ్ టు గెట్ దిస్ వన్ చాన్స్
సమ్‌థింగ్ రాంగ్. ఐ కెన్ ఫీల్ ఇట్' అని శాస్త్రీయ నృత్య వేషధారణతో కనిపిస్తున్న అదా శర్మ పాడుతుంటే 'వాహ్వా' అనకుండా ఉండలేము.



చదువుకో తమ్ముడా... చదువుకో చదువుకుంటే కలలు పండే కాలమే నీదవుతది

ఢిల్లీలోని కమలానగర్ మార్కెట్‌కు దగ్గరలో ఉన్న ఫుట్‌పాత్‌పై కూర్చున్న ఒక పిల్లాడు శ్రద్ధగా చదువుకుంటూనే మరో వైపు హెయిర్ బ్యాండ్‌లను అమ్ముతున్నాడు. ఇది చూసిన హ్యారీ అనే ఫొటోగ్రాఫర్ పిల్లాడితో మాటలు కలిపాడు.

ఆరో క్లాసు చదువుతున్న పవన్ తన కుటుంబానికి సహాయంగా ఉండడం కోసం ఫుట్‌పాత్‌పై హెయిర్ బ్యాండ్‌లు అమ్ముతుంటాడు. అలా అని చదువును ఎక్కడా నిర్లక్ష్యం చేయడు. ఏ రోజు పాఠాలు ఆ రోజు శ్రద్ధగా చదువుకుంటాడు. తన కుటుంబ స్థితిగతులను హ్యారీకి చెప్పాడు పవన్.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో తక్కువ టైమ్‌లోనే పది మిలియన్‌లకు పైగా వ్యూస్‌తో దూసుకుపోయింది. పవన్ కుటుంబానికి అండగా నిలబడడానికి చాలా మంది ముందుకు రావడం మరో విశేషం.

'జుట్టున్నమ్మ ఏ కొప్పు వేసినా అందమే' అన్నారు గానీ 'టాలెంట్ ఉన్న వ్యక్తి కత్తెర ఉపయోగించకుండా హెయిర్ కట్ చేసినా జుట్టుకు అందమే' అని ఎవరూ అనలేదు. విషయంలోకి వస్తే... తమిళనాడులో ఒక బార్బర్ తన కస్టమర్‌కు హెయిర్ కటింగ్ చేయడానికి కత్తెర ముట్టుకోకుండా 'మంట'ను ఉపయోగించాడు. క్లయింట్

మంటతో హెయిర్ కట్ చేస్తాడు... మండిపడకండి సార్!



జుట్టు కత్తిరించడానికి, స్టైల్ చేయడానికి 'ఫైర్ టార్చ్'ను ఉపయోగించి రకరకాల విన్యాసాలు చేశాడు. 'ఎక్స్'లో ప్రత్యక్షమైన ఈ వీడియో క్లిప్ ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.

ఇక ఈ వీడియోకు వచ్చిన స్పందన విషయానికి వస్తే... బార్బర్ నైపుణ్యం, ధైర్యాన్ని చాలామంది అభినందించగా కొద్దిమంది మాత్రం 'నీ దుంపతెగ ఇదేమీ దుస్సాహసం' అన్నట్లుగా కామెంట్లు పెట్టారు. 'నెత్తి మీద ఇంత దగ్గరగా మంటను ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలు...' అంటూ చెప్పుకొచ్చారు కొందరు.

క్లయింట్‌కు ఎర్ర వస్త్రం చుట్టి మరీ ప్రయోగంలోకి దిగాడు బార్బర్. రెడ్ క్లాత్ చుట్టడం అనేది యాదృచ్ఛికంగా జరిగిందా లేక 'ఇది ప్రమాదం సుమీ' అని చెప్పకనే చెప్పాలనుకున్నాడో తెలియదు.

కశ్మీర్‌కు చెందిన పారా క్రికెటర్ అమిర్ హుసేన్ జీవితం వెలిగింది. రెండు చేతులూ లేకపోయినా మెడతో బ్యాట్ పట్టి ఆడే అమిర్ తనను ఇన్‌స్పైయిర్ చేసిన క్రికెట్ దేవుడు సచిన్‌ని జీవితంలో కలుస్తాననుకోలేదు. కలిశాడు. అంతేనా? సచిన్ నుంచి ఊహించని బహుమతి అందుకున్నాడు. ఈ వివరం ఏమిటంటే...

క్రికెట్ దేవుడే దిగి వస్తే...




సచిన్ టెండూల్కర్ తన భార్య అంజలి, కుమార్తె సారాతో కశ్మీర్ పర్యటనలో ఉన్నాడు. ఇది అతని తొలి కశ్మీర్ పర్యటన అని భోగట్టా. అక్కడి 'చార్సో' అనే ఊళ్లో ఉండే బ్యాట్ల తయారీ కేంద్రాన్ని సచిన్ సందర్శించాడు. అంతే కాదు... అక్కడి 'బిజ్‌బెహారా' ప్రాంతానికి చెందిన పారా క్రికెటర్ అమిర్ హుసేన్‌ను తన హోటల్‌కు పిలిపించుకుని ప్రత్యేకంగా కలిశాడు. అమిర్ హుసేన్ ప్రస్తుతం కశ్మీర్ పారా క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా ఉన్నాడు. పుట్టుకతో చేతులు లేని అమిర్ తన జీవితంలో పేర్కొన్న నిరాశను సచిన్‌ను చూసి ఇన్‌స్పైయిర్ అయి క్రికెటర్ కావడంతో పోగొట్టుకున్నాడు. బ్యాట్‌ను మెడ, భుజాల మధ్య పట్టి అతను క్రికెట్ ఆడతాడు. ఈ స్ఫూర్తిమంతమైన గాథను విన్న సచిన్ తన పర్యటన సందర్భంగా అమిర్ హుసేన్‌ను కలిశాడు. 'నిన్ను కలవడం సంతోషం' అని 'ఎక్స్'లో తానే పోస్ట్ పెట్టాడు. సచిన్‌ని చూడగానే ఇలాంటిది తన జీవితంలో జరిగిందా అన్నట్టుగా భావోద్వేగంతో కదిలిపోయాడు అమిర్. 'ఇలాగే నువ్వు మమ్మల్ని ఇన్‌స్పైయిర్ చేయి' అని అమిర్‌తో సచిన్ చెప్పాడు. అంతేనా? తను సంతకం చేసిన బ్యాట్ ఇచ్చి అమిర్‌ని తబ్బిబ్బు చేశాడు.

సర్వర్ డ్రోన్ సుందరం



కాఫీ హోటల్ ఏదైనా సర్వర్ గారు సుందరమే అయి ఉంటాడని గతంలో అనుకునేవారు. ఎందుకంటే టిఫిన్ హోటల్స్ తమిళులే నడిపేవారు కాబట్టి. ఇప్పుడు సర్వర్ గారి అడ్రస్ గల్లంతయ్యేలా ఉంది. మనుషులకు జీతాలు ఇవ్వడం కంటే ఒక డ్రోన్‌తో మేనేజ్ చేయొచ్చని కోల్‌కతా రెస్టారెంట్ డిసైడ్ అయ్యింది.

వాన కోసం ఆకాశం వైపు చూడొచ్చుగాని కాఫీ కోసం కూడా చూడొచ్చా? చూడొచ్చు. ఆకాశం నుంచి కాఫీ ఎగిరొచ్చి చేతికి అందుతుంది. ఇది కోల్‌కతా సాల్ట్‌లేక్ సిటీ ఏరియాలోని 'కోల్‌కతా 64' అనే రెస్టారెంట్ వారు తమ కస్టమర్లను ఆకర్షించడానికి వేసిన సాంకేతిక ఎత్తుగడ. ఆకర్షణ. రెస్టారెంట్ లోపల కూచున్న వారికి సర్వర్లు కాఫీ అందించినా బయట తమకు తోచిన చోటులో కూచుని కాఫీని ఆస్వాదించాలంటే డ్రోన్ సుందరం గారే కాఫీని అందిస్తారు. ఈ వీడియో ఇన్‌స్టాలో ప్రత్యక్షం కాగానే 'ఇదేదో బాగానే ఉంది' అని చాలామంది మెచ్చుకుంటున్నారు. అయితే ఈ యంత్రం మనిషిని మాయం చేస్తున్నట్టే. మన దేశంలో మధ్యతరగతి జీవులకు కాఫీ హోటళ్లు, అందులో పని చేసే సర్వర్లు జీవితంలో భాగం. అందుకే సినిమాల్లో, సాహిత్యంలో సర్వర్లు కనపడతారు. కె.బాలచందర్ తీసిన 'సర్వర్ సుందరం'లో నగేశ్ నటించి పేరు గడించాడు. 'శుభలేఖ'లో చిరంజీవి కూడా 'వెయిటర్' అనబడు 'సర్వరే'. ఇటీవలి కాలంలో ఆనంద్ దేవరకొండ నటించిన 'మిడిల్‌క్లాస్ మెలొడీస్' టిఫిన్ సెంటర్ నేపథ్యంలో ఓనర్ కమ్ సర్వర్‌గా హీరో చేసే స్ట్రగుల్‌ను చూపుతుంది. ఏమైనా ఈ డిజిటల్ ఏజ్‌లో 'మాయమవుతున్నాడమ్మ మనిషి' అనుకోక తప్పదు.

హెల్త్

మంచి జనాదరణ పొందిన దంగల్ సినిమాలో నటించిన సుహానీ భట్నాగర్ అనే నటి ఇటీవల తన 19వ ఏట చాలా చిన్నవయసులోనే డర్మటోమయోసైటిస్ అనే వ్యాధితో చనిపోవడంతో... ఈ జబ్బు పేరు పలువురి నోట వినిపించింది. గతంలో అరుదైనదిగానే పేరున్న ఈ ఆరోగ్య సమస్య.. ఇటీవల కాస్త తరచుగా కనిపిస్తుండటం ఆందోళన గొలిపే అంశం. చాలా తీవ్రమైనదిగా పరిగణించే ఈ సమస్యకు పూర్తిగా నయం చేసే చికిత్స లేకపోయినా దీని లక్షణాలను అదుపులో ఉంచడానికి అవసరమైన చికిత్స తీసుకోకపోతే... ఒక్కోసారి ప్రమాదకరంగా పరిణమించే అవకాశమున్న ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

డర్మటో-మయోసైటిస్ అంటే?




ఇటీవల డర్మటో మయోసైటిస్‌తో మృతి చెందిన దంగల్ ఫేమ్ సుహానీ భట్నాగర్

డర్మటో మయోసైటిస్ అనే ఈ వ్యాధిలో ప్రధానంగా కండరాలు బలహీనమై, చర్మమూ ప్రభావితమవుతుంది. ఆహారాన్ని మింగలేపోవడం, శ్వాస తీసుకోలేకపోవడం, ఊపిరితిత్తులు పీచులా మారిపోయే 'ఇంటర్‌స్టిషియల్ లంగ్ డిసీజ్'కి దారితీయడం వంటి అనేక సమస్యలు ఇందులో కనిపిస్తాయి. కండరాలూ, చర్మంతో పాటు పలు కీలకమైన అవయవాలూ, వ్యవస్థలను దెబ్బతీస్తున్నందున దీన్ని కొన్ని వ్యాధుల సమాహారంలా పరిగణించే 'పాలీమయోసైటిస్' వ్యాధుల్లోనిదిగా పేర్కొంటారు. ఇందులోని మిగతా మయోసైటిస్ వ్యాధులు కాస్త మెల్లగా తమ ప్రభావాన్నీ, లక్షణాలను చూపించినప్పటికీ... 'డర్మటో-మయోసైటిస్' లక్షణాలూ చాలా వేగంగా అభివృద్ధి చెందుతూ వ్యక్తమవుతాయి. తగిన చికిత్స అందకపోతే అవి మరింత తీవ్రతరమవుతాయి.

లక్షణాలు...

ఈ వ్యాధిలో కండరాలు చాలా బలహీనంగా అనిపించడంతో పాటు ఒంటి మీద ర్యాష్ రావడం ఒక ప్రధాన లక్షణం. కొందరిలో నీరసమూ... ర్యాష్ ఒకేసారి కనిపిస్తాయి. మరికొందరిలో ఇవి వేర్వేరు సమయాలలో కనిపించవచ్చు. అంటే వారాలూ, నెలలు ఒక్కోసారి ఏళ్ల తర్వాత కూడా వ్యక్తం కావచ్చు. కండరాల బలహీనత ఎంత ఎక్కువగా ఉంటుందంటే... ● నిటారుగా కూర్చోలేకపోవడం. ● కూర్చున్నవారు కనీసం కుర్చీ / సోఫా నుంచి లేవలేకపోవడం. ● మెట్లు ఎక్కలేకపోవడం ● పక్కకు ఒరిగిన వాళ్లు మళ్లీ పైకిలేవలేకపోవడం... ● ఇదే బలహీనత, నిస్సత్తువ గుండె, ఊపిరితిత్తులకూ ఆవరించడంతో శ్వాసతీసుకోవడం కష్టం కావడం, దగ్గు వంటి లక్షణాలూ కనిపిస్తాయి.
● బలహీనతతో పాటు జ్వరం, బరువు తగ్గడం, కండరాల, కీళ్ల నొప్పులు, ఒంటి మీద ర్యాష్.

నిర్ధారణ పరీక్షలు...

● కొన్ని రకాల రక్తపరీక్షలతో డర్మటో-మయోసైటిస్‌ను నిర్ధారణ చేస్తారు. కండరాలు దెబ్బతిన్నాయని సూచించే కొన్ని రకాల మజిల్ ఎంజైమ్‌ల రక్తపరీక్షలతో పాటు, ఆటో యాంటీబాడీస్ (వ్యాధి నిరోధక వ్యవస్థను దెబ్బతీసే సొంత ఇమ్యూన్ కణాల)ను కనుగొనే రక్తపరీక్షలతో దీన్ని నిర్ధారణ చేస్తారు.
● ప్రభావితమైన చర్మం నుంచి ముక్క సేకరించి చేసే 'స్కిన్ బయాప్సీ' కూడా చేస్తారు. దీనివల్ల దేహంలోని ఇన్‌ఫ్లమేషన్‌తో కండరాలు దెబ్బతిన్నాయా లేదా అని పరిశీలించే అవకాశం దొరుకుతుంది. ● కొన్ని సందర్భాల్లో ఎమ్మారై, ఛాతీ ఎక్స్-రే పరీక్షలూ నిర్ధారణకు ఉపకరిస్తాయి. ● అవసరాన్ని బట్టి ఎలక్ట్రో మయోగ్రఫీ (ఈఎమ్‌జీ) అనే పరీక్షతో కండరాలు-నరాల స్పందన ఎలా ఉందో కూడా తెలుసుకోవాల్సి రావచ్చు.

కారణాలు...

ఈ వ్యాధి ఎందుకు వస్తుందనే అంశంపై నిర్దిష్టమైన కారణాలు ఇంకా స్పష్టంగా తెలియవు. జన్యుపరమైన సమస్యలోనూ, వాతావరణం కాలుష్యం, సూర్యుడి తీక్షణమైన కాంతిలో ఎక్కువసేపు గడపడం వల్ల వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. పర్యావరణ సమస్యలతో పాటు పొగతాగడం, కొన్ని రకాల ఔషధ దుష్ప్రభావాలూ ఇందుకు కారణం కావచ్చని అంచనా. కొన్ని రకాల వైరల్ సమస్యలతో బాధపడ్డవారిలోనూ డర్మటో-మయోసైటిస్ కనిపించడం చాలా సందర్భాల్లో కనిపించింది.

మేనేజ్‌మెంట్ - చికిత్స...

సొంత వ్యాధినిరోధక వ్యవస్థ దేహానికి ప్రతికూలంగా మారే ఆటో ఇమ్యూన్ డిసీజ్ కావడం వల్ల ఈ వ్యాధిని పూర్తిగా నయం చేసే అవకాశం లేదు. అయితే లక్షణాలను అదుపు చేస్తూ, వ్యాధి మరింత పెరగకుండా నియంత్రించే మేనేజ్‌మెంట్ పద్ధతులతో డర్మటో-మయోసైటిస్‌పై అదుపు సాధించాలి. ఇందుకు కార్టికో స్టెరాయిడ్స్‌తో పాటు ఫిజియోథెరపీ లాంటి ఫిజికల్ పద్ధతులు ఎంతగానో ఉపకరిస్తాయి.
● కార్టికో స్టెరాయిడ్స్ : తీవ్రత ఆధారంగా వీటిని, వీటి మోతాదులను కేవలం డాక్టర్లు మాత్రమే సూచించాలి. వారి పర్యవేక్షణలోనే కార్టికో-స్టెరాయిడ్స్ వాడాల్సి ఉంటుంది. అలాగే టాపికల్ స్టెరాయిడ్స్ అని చెప్పే... పైపూత మందులూ వాడాల్సి రావచ్చు.
● ఫిజియోథెరపీ : బలహీనపడ్డ కండరాల్లో బలమూ, సత్తువ నింపడానికి, దెబ్బతిన్న కండరాల్లో మునపటి శక్తి సాధించడానికి ఫిజియోథెరపీ బాగా ఉపయోగపడుతుంది. డర్మటో-మయోసైటిస్‌లో ఫిజియోథెరపీ చాలా కీలకం.
● ఇమ్యూనో సప్రెసెంట్ ఔషధాలు : వ్యాధి నిరోధక వ్యవస్థలో తీవ్రంగా మారి దెబ్బతీస్తున్న కణాల తీవ్రతలను అదుపు చేసే మందులైన ఇమ్యూనో సప్రెసెంట్స్‌ను చాలా సునిశితమైన రీతిలో వాడాలి.
● ఇంట్రావీనస్ ఇమ్యూనోగ్లోబ్యులిన్ (ఐవీఐజీ) : ఇమ్యూనో సప్రెసెంట్లతో పాటు... మన రక్తంలోని ప్లాస్మాలోనే ఉండే ఈ స్వాభావికమైన పదార్థాలను బయటనుంచి బాధితులకు ఇవ్వడం అనేది మరో ఆధునిక ప్రత్యామ్నాయ చికిత్స ప్రక్రియల్లో ఒకటి.
● స్పీచ్ థెరపీ: అన్ని కండరాల్లాగానే గొంతు కండరాలు బలహీనపడి మాట్లాడటం కష్టమైన వారికి స్పీచ్ థెరపీ ద్వారా మాట్లాడటానికి శిక్షణ ఇవ్వాల్సి రావచ్చు. అలాగే మింగడం కష్టమైన వారికీ ఆ దిశగా సహాయం అవసరం పడవచ్చు. ● వ్యాధి మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఎండల్లో ఎక్కువగా తిరగకపోవడమూ, బాగా ఎండలో తిరగడం తప్పనిసరి అయితే నిపుణుల సలహా మేరకు ఎస్‌పీఎఫ్ 50కి పైన ఉండేవీ, తగిన సన్-స్క్రీన్ లోషన్స్ వాడటం వంటివీ తప్పనిసరి.

ఈ మేనేజ్‌మెంట్ పద్ధతులూ, డాక్టర్ల నిశిత పర్యవేక్షణలో స్టెరాయిడ్స్‌తో పాటు ఇతర మందులూ తీసుకుంటూ ఉన్నట్లయితే తొలుత లక్షణాలు తగ్గి, పరిస్థితులు చాలావరకు నార్మల్ అవుతాయి. ఆ పైన వ్యాధిని అదుపులో ఉంచుకుంటూ దాదాపుగా సాధారణ జీవితాన్ని జీవించే అవకాశాలు కొంతవరకు బాగానే ఉంటాయి. ప్రత్యేకంగా నివారణ అంటూ లేకపోయినా... ఆరోగ్యకరమైన పరిసరాల్లో ఉండటం, పొగతాగడం పూర్తిగా మానేయడం చాలా మంచిది. పైగా ఈ వ్యాధి గొంతును, ఊపిరితిత్తులు, గుండెను ప్రభావితం చేసేదైనందున పొగతాగడం మానేయడం మరింత ఎక్కువ అవసరం.



డాక్టర్ మహమ్మద్ ఇర్ఫాన్,
సీనియర్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్

● హైపర్‌ట్రైగ్లిజరైడెమియా

ట్రైగ్లిజరైడ్స్‌ను తగ్గించుకోవాల్సిందే!... ఎందుకంటే?



రక్తంలో కొలెస్ట్రాల్ వంటి మరో రకం కొవ్వులే ఈ ట్రైగ్లిజరైడ్స్. రక్తంలో ఈ ట్రైగ్లిజరైడ్స్ మోతాదులు ఉండాల్సిన దానికంటే పెరిగే కండిషన్ 'హైపర్ ట్రైగ్లిజరైడెమియా' అంటారు. ఇది అనేక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉన్నందున 'హైపర్ ట్రైగ్లిజరైడెమియా' ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, అవసరమైతే మందులు వాడుతూ, వాటిని నియంత్రణలో ఉంచుకోవడం అవసరం.

ట్రైగ్లిజరైడ్స్ అనేవి ఆహారంలో కొవ్వులు ఎక్కువగా తీసుకోవడంతో పాటు... కాలేయంలోంచి కూడా ఉత్పత్తి అవుతాయి. వీటి మోతాదులు పెరగడం ప్రధానంగా గుండెజబ్బుల ముప్పు తెచ్చిపెట్టవచ్చు. అందుకే రక్తపరీక్షల్లో ట్రైగ్లిజరైడ్స్ కొవ్వులు ఎక్కువగా ఉన్నట్లు తేలితే వాటిని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది.

ముప్పును పెంచే అంశాలివి...

డయాబెటిస్, ప్యాంక్రియాటైటిస్, కిడ్నీ జబ్బులు, హైపోథైరాయిడిజమ్ వంటి సమస్యలు ఉన్నవారిలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉండటం మరింత ముప్పు తెచ్చిపెట్టే అంశంగా మారుతుంది.

లక్షణాలు...

● జీర్ణవ్యవస్థకు సంబంధించి : వికారం, కొన్నిసార్లు వాంతులు, కొన్ని సందర్భాల్లో కడుపు మధ్యభాగంలో నొప్పి.
● శ్వాస వ్యవస్థలో : అతి కష్టమ్మీద శ్వాస తీసుకోవడం.
● చర్మం మీద : పసుపుపచ్చ రంగులో ఉబ్బెత్తుగా కొవ్వు పేరుకున్నట్లుగా కనిపించే ప్యాచ్‌లు (గ్జాంథోమాస్). ఈ ప్యాచ్‌లు ఛాతీ, వీపు, పిరుదుల మీద కనిపించవచ్చు.
● కళ్ల దగ్గర : కనురెప్పల చివర్లలో, కంటికింద ఉబ్బెత్తుగా కనిపించే సంచుల్లాంటివి.
● నరాలకు సంబంధించి : గుండెకు ముప్పు తెచ్చే ఈ ట్రైగ్లిజరైడ్స్ కొన్నిసార్లు మతిమరుపు, డిప్రెషన్‌లకూ దారితీయవచ్చు.

నిర్ధారణ.. సాధారణ రక్తపరీక్షలో కొవ్వుల మోతాదు తెలుసుకునే లిపిడ్ ఎనాలసిస్. అవసరాన్ని బట్టి ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, టీఎస్‌హెచ్ అనే థైరాయిడ్ పరీక్ష, మూత్రపరీక్ష, కాలేయ పరీక్షలూ నిర్వహిస్తారు.

ట్రైగ్లిజరైడ్స్ తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

రక్తంలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉన్నప్పుడు కొన్ని ఆహార నియమాలు పాటించడం ద్వారా వాటిని తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు జీవనశైలిలో మార్పులు తప్పనిసరి. ● బరువు తగ్గాలి. ఇందుకు ఆహారంలో మార్పులు చేసుకోవాలి. ● పొట్టుతీయని ధాన్యాలు (అంటే... దంపుడు బియ్యం, పొట్టుతీయని రాగులు, గోధుమలు), పొట్టుతీయని పప్పుధాన్యాలు, మొలకెత్తిన గింజలు తీసుకోవాలి. ● కొవ్వులు (శాచ్యురేటెడ్ ఫ్యాట్, కొలెస్ట్రాల్) తక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. తాజా పండ్లు, డ్రైఫ్రూట్స్‌లో పీచు ఎక్కువగా ఉండటం వల్ల అవి ట్రైగ్లిజరైడ్స్‌ను తగ్గించడంలో బాగా ఉపయోగపడతాయి. ● మాంసాహారం తీసుకోవాలనుకునేవారు వారంలో మూడు సార్లు చేపలు తీసుకోవచ్చు. అది కూడా కేవలం ఉడికించి వండినవీ, గ్రిల్డ్ ఫిష్ మాత్రమే తీసుకోవాలి. డీప్ ఫ్రై చేసినవి తీసుకోవడం సరి కాదు. ● కొవ్వుల మోతాదు ఎక్కువగా ఉండే మాంసాహారం (రొయ్యలు, చికెన్ స్కిన్), వేపుళ్లు, నెయ్యి, నేతితో చేసిన స్వీట్స్, బేకరీ ఐటమ్స్‌కు దూరంగా ఉండాలి. ● స్మోకింగ్, ఆల్కహాల్ పూర్తిగా మానేయాలి. ● రోజూ కనీసం 30 నిమిషాలు శారీరక శ్రమ/వాకింగ్ వంటి వ్యాయామాలు చేయాలి.

మందులు... ట్రైగ్లిజరైడెమియా తీవ్రత ఎక్కువగా ఉన్నవారు డాక్టర్లు సూచించిన మీదట కొన్ని మందులు వాడాల్సి రావచ్చు. దీని తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నవారిలో అరుదుగా కొందరిలో 'ప్లాస్మాఫెరిసిస్' అనే ప్రక్రియ అవసరం పడవచ్చు.



డాక్టర్ ప్రవీణ్ కుమార్ కులకర్ణి,
సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్

మెడి టిప్

వెన్ను / నడుము నొప్పా...?

బైక్ ఎర్గానమిక్స్ లోపాల వల్ల కావచ్చు!

వెన్ను నొప్పి, నడుము నొప్పి కనిపించడానికి అనేక కారణాలున్నప్పటికీ... కొన్నిసార్లు బైక్ మీద కూర్చునే విధానంలో తేడాల వల్ల కూడా నొప్పి రావచ్చు. అప్పుడు డ్రైవింగ్‌పరంగా తప్పిదాలు ఏమైనా ఉన్నాయేమోనని ఒకసారి పరీక్షించుకుని, సరిదిద్దుకోవాల్సిన అంశాలివి...
● బైక్‌పై కూర్చున్నప్పుడు వీపు నిటారుగా ఉండి, వెన్ను ఒంగిపోకుండా జాగ్రత్త పడాలి. అయితే కొన్ని స్పోర్ట్స్ బైక్‌లలో సీట్లు మరీ ఏటవాలుగా ఉండి, కూర్చొనే భంగిమ కూడా వాలుగా ఉండి, బాగా ముందుకు వాలినట్లుగా కూర్చోవాల్సి వస్తుంది. ఇలా రూపొందించిన ఫ్యాషన్ బైక్స్ వల్ల వెన్ను నిటారుగా లేక వెన్ను / నడుము నొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువ. ● బైక్‌లపై ప్రయాణం చేసేవారు వీపున బ్యాక్‌ప్యాక్స్ లేదా ల్యాప్‌టాప్ బ్యాగ్స్ పెట్టుకొని వెళ్తుండటం మామూలే. ఈ బ్యాగు బరువు నడుంపైనా భారం పడటం వల్ల కూడా నొప్పి రావచ్చు. అందువల్ల బ్యాగు భారం వీపు మీద పడకుండా, ఆ బరువు సీటు మీద పడేలా, బ్యాగ్ సీట్ మీద ఆనేలా అమర్చుకోవాలి. ● తాము కూడా నిటారుగా, సౌకర్యవంతంగా కూర్చుంటున్నారా లేదా అన్నది చూసుకోవాలి. సిట్టింగ్ పోష్చర్‌లో లోపాలుంటే సరిదిద్దుకోవాలి.

ఈ జాగ్రత్తల తర్వాత కూడా వెన్ను, నడుము నొప్పి వస్తుంటే ఒకసారి డాక్టర్‌ను సంప్రదించాలి.